# ఉత్సాహంగా...ఉల్లాసంగా...

-కె.వి.సుమలత

ఈజీచైర్‌లో పడుకుని కళ్లకు చేయినడ్డుపెట్టుకున్న ప్రకాశరావుగారు నిద్రపోవడంలేదు. ఉదయం కొడుకు రూమ్ పక్కనుండి వెళ్తుండగా వినిపించిన కోడలి మాటలు నెమరు వేసుకుంటున్నారు.

"ఏమండీ! మీ ఫ్రెండ్ వేణుగారి మిసెస్ మొన్న కలసినప్పుడు తనకు తెలిసిన పనిపిల్ల ఉంది అని చెప్పింది. ఆ పిల్లను మన ఇంట్లో రోజంతా ఉండేటట్లుగా మాట్లాడుకుందాము. నిన్నటి నుండి ఆవిడకు ఫోన్ చేస్తుంటే స్విచ్ ఆఫ్ అని వస్తోంది. ఒకసారి వేణుగారిని అడిగి ఆవిడ నెంబర్ మారిందేమో తెలుసుకొండి."

"అలాగే తెలుసుకుంటాను. అయినా సావిత్రమ్మ పనికి వస్తుందిగా. మరో పనిపిల్ల ఎందుకోయ్?" అన్నాడు శేఖర్.

"సావిత్రమ్మ ఉదయం, సాయత్రం మాత్రమే వస్తుంది. అత్తయ్యగారికి ఆరోగ్యం బాగాలేదు కదా. డాక్టర్ ఆవిడను రెస్ట్ తీసుకోమన్నారు. మామయ్యగారు కూడా ఇంట్లోనే ఉంటున్నారు. జ్యూస్ తీసివ్వడానికో, టీ పెట్టడానికో చేతికింద చిన్న చిన్న పనులు చేయడానికి అందుబాటులో వుంటుంది."

"అది సరే. రోజంతా ఇంట్లో ఉండడమంటే డబ్బులు ఎక్కువ అడుగుతారేమో. మన బడ్జెట్‌కి సరిపోతుందా?" అన్నాడు.

"తప్పదు మరి. నాకు హడావుడిగా వంట చేసేసరికి టైమ్ సరిపోతుంది. అత్తయ్యగారికి ఏమీ చేయలేకపోతున్నాను. ఆవిడకు బాగుంటే వంట పని ఆవిడే చూసుకునేది. ఇక నాకు టైమ్ అయింది. మరచిపోకుండా ఫోన్ చేయండి. వెళ్తున్నాను" అంటూనే హేమ బయటకు వచ్చేసింది.

ప్రకాశరావుగారు హెచ్‌ఎమ్‌గా రిటైర్ అయి దాదాపు రెండునెలలు అవుతోంది. అంకితభావంతో ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేకూర్చిన వ్యక్తి. రిటైర్‌మెంట్ కాలం సమీపిస్తుందంటే స్కూల్‌కి, పిల్లలకు, పాఠాలకు దూరంగా ఉండాల్సి వస్తుందని మదనపడ్డారు.

ఆరోగ్యకరమైన మంచి అలవాట్లు ఆయనను దృఢంగానే ఉంచాయి. రిటైర్ అవకముందు నుండే ఆయన ఉద్యోగ విరమణ కాలంలో ఏ విధంగా జీవితం గడపాలో ప్రణాళిక వేసుకున్నారు. సమయం వృధా చేయకుండా తను చేయగలిగిన పని ఏదైనా చేయాలన్నదే ఆయన ఆలోచన. కానీ నిర్దిష్టమైన అభిప్రాయానికి ఇంకా రాలేకపోతున్నారు. తనవల్ల పదిమందికి మంచి జరగాలన్నదే ఆయన ప్రధాన ఆశయం.

ప్రకాశరావు, జానకమ్మలకు ముగ్గురు పిల్లలు. పెద్దకొడుకు శేఖర్, అతని భార్య హేమలు ఇద్దరూ టీచర్లే. ప్రకాశరావుగారితో కలసి ఒకే ఇంట్లో ఉంటారు. రెండవ కొడుకు వాసు, కూతురు నళినీలకు వివాహాలు అయిపోయి వైజాగ్‌లో ఒకరు, కాకినాడలో ఒకరు స్థిరపడ్డారు. ప్రకాశరావుగారికి పిల్లల బాధ్యతలు తీరిపోయాయి. ఆయన జీవితంలో పెద్దగా ఒడిదుడుకులేమీ ఎదుర్కోలేదనే చెప్పవచ్చు. ప్రశాంతమైన జీవనం ఆయనది. జానకమ్మ కూడా అనుకూలవతి. కోడలు కూడా ఉద్యోగస్థురాలు కావడంతో ఇంట్లో పనులన్నీ తనే చూసుకునేది. హేమ అత్తగారికి సహాయపడకపోయినా "మీరందరూ ఇంట్లో నుండి వెళ్లిపోయాక నేను ఖాళీగా ఉండి ఏం చేయాలి" అని అడ్డుచెప్పేది.

ప్రకాశరావుగారు రిటైర్ అయ్యాక పిల్లలిద్దరి దగ్గరకు భార్యాభర్తలిద్దరూ వెళ్లివచ్చారు. జానకమ్మగారి కోరిక మేరకు తీర్థయాత్రలకు కూడా వెళ్దామనుకున్నారు. కానీ జానకమ్మ కాలుకి సయాటికా రావడంతో ఆగిపోయారు.

కాలు నొప్పితో అత్తగారు మంచం దిగలేకపోవడంతో హేమ పరిస్థితి ఇరుకున పడ్డట్టయింది. శేఖర్‌కి ఇద్దరు పిల్లలు. పాప ఫార్మసీ, బాబు ఇంజనీరింగ్ చదువుతున్నారు. ఇద్దరూ హాస్టల్‌లో ఉండడంతో ఇంట్లో ఉండేది నలుగురే. హేమలో చురుకుదనం తక్కువ. అత్తగారి సహాయం లేకుండా వంట చేసుకోవడమే కష్టంగా ఉందామెకు.

ప్రకాశరావుగారు హేమ మాటలతో అత్తగారికి ఏమీ సేవ చేయలేకపోతున్నాననే బాధను గమనించాను. పదిహేను రోజుల నుండి మంచం మీద వున్న జానకమ్మ తనకు కావాల్సినవి భర్త చేస్తుంటే మనసులోనే బాధ పడుతుంది. 'రిటైర్ అయినాక రెస్టు తీసుకోవాల్సిన మనిషితో పనులు చేయించుకుంటున్నానేమిటి' అనేదే ఆవిడ బాధ.

"ఇన్ని సంవత్సరాలుగా కోడలు కష్టపడకుండా నేనే అన్ని పనులు చూసుకునేదాన్ని. నాకు బాగా లేకపోతే హేమ లీవు పెట్టి ఇంట్లో ఉండవచ్చు కదండీ" ఉండబట్టలేక భర్తతో అన్నారావిడ.

"ఉద్యోగమన్నాక ఎవరి సాధక బాధకాలు వారికుంటాయి. నిన్ను చూడడానికి నేనున్నాను కదా" అన్నారాయన.

ఆ మాటలు ఆవిడను సంతృప్తిపరచలేకపోయాయి. అత్తగారి పనులు చూడడానికని పదిపన్నెండేళ్ల వయసున్న అంజలిని ఏర్పాటు చేసింది హేమ.

అంజలి భలే చుర్రుకైన పిల్ల. ఏ పనైనా ఇట్టే చేసేసేది. ఏవేవో కబుర్లు చెబుతూ జానకమ్మగారిని, ప్రకాశరావుని ఊపిరాడనిచ్చేదికాదు. ప్రకాశరావుగారి దగ్గర చదువు నేర్చుకునేది. ఆ అమ్మాయి తెలివితేటలకు ఆయనే ఆశ్చర్యపోయేవారు.

జానకమ్మగారు పూర్తిగా కోలుకునేసరికి నాలుగునెలలు పట్టింది. హేమ తను స్వయంగా చేయకపోయినా అత్తగారికి సపర్యలు చేయడా

నికి పనమ్మాయిని పెట్టాను కదా అనే భావంతో రిలీఫ్‌గా ఉంది. కానీ జానకమ్మ మనసులో కోడలిమీద రవ్వంత విముఖత భావం ఏర్పడింది. పైకి కనబరచకపోయినా ఆవిడ అసంతృప్తిని ప్రకాశరావుగారు పసిగట్టారు. భార్యాభర్తలు ఉద్యోగస్తులయితే ఆ ఇంట్లో ఉన్న పెద్దవాళ్ల పరిస్థితి ఆలోచించవలసిందే. పెద్దలను నిర్లక్ష్యం చేయకూడదు. బాధ్యతగా ఉందాము అనుకునే వాళ్లు కూడా సరైన న్యాయం చేయలేరు. పిల్లలను అర్థం చేసుకుని మిన్నకుంటే అక్కడ సమస్యలు తలెత్తవు. లేకపోతే నిప్పు పొగ రాజుకున్నట్లే.

'హేమ పరిస్థితిని, జానకమ్మ మనసుని అర్థం చేసుకుని సర్దుబాటు తప్ప ఇలాంటి సమస్యలకు పరిష్కారమంటూ ఉంటుందా?' అనుకున్నారు ప్రకాశరావుగారు. చేలగల్లు వెంబడి వాకింగ్‌కి వెళ్లిన ప్రకాశరావుగారికి కొబ్బరిచెట్టు క్రింద కూర్చున్న మల్లిగాడు కనిపించాడు.

ప్రకాశరావుగారికి వున్న కొద్దిపాటి పొలాన్ని ఇదివరకు మల్లిగాడే సేద్యం చేసేవాడు. ఇప్పుడు వాడి కొడుకు చేస్తున్నాడు. ఈమధ్యకాలంలో మల్లిగాడు కనిపించడంలేదు ఆయనకు.

"ఏరా! ఈమధ్య కనిపించడంలేదేంటి? కులాసాయేనా?" అంటూ ఆగారు.

"అయ్యగారూ! మీరా? కులాసాగా ఉంటున్నారాండీ? నేనే వచ్చి కనబడదామనుకుంటున్నానండీ" లేచి నిలబడుతూ మల్లిగాడు అన్నాడు.


"ఏంట్రా సంగతి చెప్పు. కూర్చో" అంటూ అక్కడే చతికిలబడ్డారాయన.

"ఏముందయ్యగారూ! మాకు చదువుసంధ్య ఉండదు. నిండా ఇరవై సంవత్సరాలు నిండక ముందే పెళ్లిళ్లయిపోతాయి. నలభై ఐదేళ్లు రాకుండానే తాతలము అయిపోతాము. కూలి పనికి పిలిచేవాళ్లు నా కొడుక్కి పని ఇస్తారుగానీ నాకు ఇవ్వరు. పని చేయగల సత్తా నా వంటికి ఉందని చెప్పినా నేను ముసలివాడికిందే జమ అవుతున్నా. నాలాంటి వాళ్లు ఎందరో? మా ఆవిడ పని కూడా అంతే. కూలీ పని మా కోడలికి దొరుకుతుంది. కానీ మా ఆడదానికి దొరకదు. మాకు పని దొరకడంలేదని ఆకలెయ్యక మానదు కదయ్యగారూ? పని చేసే వాళ్లిద్దరూ తినగా మిగిలి వున్నదేదో మాకు పెడతారు. తినో తినకో పిల్లలను పెంచుకుంటామయ్యా. చేతికంది వచ్చాక వాళ్ల కుటుంబమే వాళ్లకు ముఖ్యమవుద్ది. కన్నవాళ్లం దూరమవుతాం. కడుపు నిండా తిండీ లేదు, చేద్దామంటే పనీ లేదు. ఎక్కడైనా పని చూపించండయ్యా" అని వాపోయాడు మల్లిగాడు.

వాడి మాటలతో ఆయనకు తెలియని కొత్త విషయం గోచరించింది.

"సరే అలాగే చేస్తాలేరా" అంటూ ఆలోచిస్తూ ఇంటిదారి పట్టారు.

★★★



కొన్ని నెలలు గడిచాయి. "హేమా! నేను బాగానే వున్నాను కదా. అంజలిని మానిపించేయి'' అంది జానకమ్మ ఒకరోజు.


"ఉండనివ్వండి అత్తయ్యా మరో కొద్దిరోజులు'' అంది హేమ.

"పిల్ల అలవాటయిపోయి మానిపించ బుద్ధికాక ఇన్నాళ్లూ ఆగాను. ఇక దాని అవసరంలేదు'' అన్నారావిడ.

అంజలికి రావాల్సిన డబ్బులు లెక్కగట్టిఇచ్చి 'ఇక రావద్దు' అని చెప్పింది హేమ. ఒక గంట తరువాత ముసలమ్మతో తిరిగి వచ్చింది అంజలి. హాలులో కూర్చుని పుస్తకం చదువుతున్న ప్రకాశరావుగారు "ఏమిటి అంజలీ మళ్లీ వచ్చావు? ఎవరీమె?'' అన్నారు.


"మా మామ్మండీ తాతయ్యగారూ'' అంది అంజలి.

"అయ్యగారూ! అంజలి ఏదయినా తప్పు చేసిందాండీ. ఎందుకు పని మానిపించారు?'' అందా ముసలావిడ.



## వెరైటీ రోబో

'శివాజీ' సినిమా గురించిన వివరాలను విడుదల వరకూ రహస్యంగా ఉంచలని అనుకున్న దర్శకుడు ఏమీ చేయలేకపోయాడు. శంకర్ తాజా చిత్రం 'రోబో' ఇతివృత్తం ఏంటి వగైరాల్ని కూడా రహస్యంగా వుంచుదామని ఎంత ప్రయత్నించినా సాధ్యపడడంలేదు. ఒక రోబో- ఐశ్వర్యని ప్రేమించడం-దీన్ని అవకాశంగా తీసుకుని ఓ సైంటిస్టు పరిశోధనలు చేయడం 'రోబో' అసలు కథ అంటున్నారు. ఈ సినిమా కోసం రజనీకాంత్ 5 కిలోల బరువు పెరుగుతుంటే ఐశ్వర్యారాయ్ ఏకంగా 200 కాల్షీట్లు కేటాయించడం విశేషంగా చెబుతున్నారు సినీ జనాలు.



అంతలో జానకమ్మ లోపలి నుండి వస్తూ ఆ మాటలు వింది.

"అదేం లేదమ్మా. పిల్ల బంగారం. మానిపించడానికి ప్రాణమొప్పక ఇన్నాళ్లూ ఉంచుకున్నాము. నాకు ఆరోగ్యం బాగాలేనప్పుడు ఆసరాకి పెట్టుకున్నాము. ఇప్పుడు బాగుందమ్మా. దాని తప్పేమీలేదు.

జానకమ్మ మాటలకి ఒక నిముషం మౌనం వహించింది.

"అమ్మా! మీ ఇంటికి వచ్చాక పిల్ల శుభ్రంగా ఉందమ్మా. జీతం రాళ్లతో నేను కడుపు నింపుకుంటున్నాను. ఎక్కడ పనికి పెట్టినా చిన్నపిల్లని కూడా చూడకుండా నరకం పెట్టేవాళ్లే. మీరు చక్కగా చూసుకుంటున్నారు. ఉండనివ్వండమ్మా'' అంది దిగులుగా.

"అదేంటమ్మా? అంజలికి తల్లిదండ్రులు లేరా?''

"లేరమ్మా. పురిటిలోనే తల్లి పోయింది. నా కొడుకు పచ్చి తాగుబోతు. మళ్లీ పెళ్లి చేసుకుని వేరే వుంటున్నాడు. తల్లినవే ప్రేమ, కూతురే మమకారం వాడికి లేవమ్మా. గవర్నమెంటోళ్లు ఇచ్చే ఫించను, ఈ పిల్ల కష్టంతోనే బ్రతుకుతున్నానమ్మా.'' ఆ మాటలకు చలించిపోయిన ప్రకాశరావుగారు, జానకమ్మ ముఖంలోకి చూసారు. ఆయన భావాన్ని గ్రహించిన ఆవిడ "సరే అంజలిని పనిలోకి పంపించమ్మా'' అంది.

ముసలమ్మ సంతోషంగా అక్కడినుండి వెళ్లిపోయింది.

"ముసలితనం మనిషికి శాపం కదండీ'' జానకమ్మ అంది.

"అవును. దాని గురించే ఆలోచిస్తున్నాను. సహజమైన వృద్ధాప్యం నుండి మనిషి తప్పించుకోలేడు. కానీ దారిద్ర్యం కూడా తోడవడం మరీ జీవితాన్ని దుర్భరం చేస్తుంది'' అన్నారు.

"నిజమే. ప్రేమగా పెంచుకున్న పిల్లలు రెక్కలొచ్చాక గూటిని కన్నవాళ్లను మరచిపోతున్నారు.'' గేటు తెరిచిన శబ్దం అవడంతో ఇద్దరూ మాట లాపి అటుకేసి దృష్టి సారించారు. ప్రకాశరావుగారి చిన్ననాటి మిత్రుడు కృష్ణ మూర్తి రావడం చూసి ఆనందంగా ఎదురెళ్లారు ప్రకాశరావుగారు.

కుశల ప్రశ్నలు అయ్యాక ఒకరి కష్టసుఖాలు మరొకరు చెప్పుకున్నారు. కృష్ణమూర్తిగారు కూడా హెచ్ఎమ్‌గానే రిటైర్ అయ్యారు సంవత్సరం క్రితం. ఆయనకు ఇద్దరు కొడుకులు. రిటైర్‌మెంట్ డబ్బులు పంచుకోవడమే కాకుండా తల్లిదండ్రులనిద్దరినీ కూడా పంచుకున్నట్లుగా విడదీసి వారున్న చోటికి తీసుకెళ్లిపోయారు.

"బాధ్యలన్నీ తీరిపోయి కృష్ణా రామా అనుకుంటూ ఒకరికి ఒకరు అండగా బ్రతకవలసిన వయస్సులో చెరొక చోట ఉస్సూరంటూ ఒంటరిగా బ్రతకాల్సి వస్తుంది. ఒక్కోసారి పిల్లల దగ్గర నుండి వచ్చేసి ఏదైనా వృద్ధాశ్రమంలో చేరిపోదామా అనిపిస్తుందిరా ప్రకాశ్'' అంటూ ఆయన బాధను స్నేహితుడికి చెప్పుకున్నారు. వృద్ధాప్యంలో వచ్చే సమస్యల గురించి మదనపడుతున్న ప్రకాశరావుగారి మనసులోకి మిత్రుడి సమస్య కూడా వచ్చి చేరింది. అంతలో లోపలి నుండి టిఫిన్ చేసి పట్టుకొచ్చింది జానకమ్మ.

"మామ్మగారూ ఇదిగోండి'' అంటూ అంజలి రింగవుతున్న ఫోన్ తెచ్చి జానకమ్మగారికిచ్చింది.

మాట్లాడిన తరువాత జానకమ్మగారు ప్రకాశరావుగారితో "అమ్మాయి ఇటీవలి కాలంలో ఎప్పుడు ఫోన్ చేసినా వాళ్ల అత్తగారి గురించే చెప్తోందండీ. ఇంట్లో ఏ పనీ చేయకుండా కూర్చోమంటే వినదట. అన్ని పనులకు తనే ముందుంటుందట. అల్లుడుగారు అమ్మాయితో మా అమ్మతో పనులు చేయిస్తున్నావు అని గొడవట. చెప్తే ఆవిడ వినదు. ఒక మూల కూర్చోకుండా నా ప్రాణం తీస్తోంది అని బాధపడుతోంది'' అంది.

"చేయగలిగిన ఓపిక ఉన్నప్పుడు పెద్దదానివయిపోయావు అని ఒక మూల కూర్చో అంటే కష్టంగానే వుంటుందిగా'' అన్నారు ప్రకాశరావుగారు.

"నిజమే. మనం కన్న మన పిల్లలకే వాళ్ల సంసారాలు వాళ్లకి ఏర్పడ్డాక మనం అడ్డమైపోతాము. మన అడ్డు ఎలా తొలగించుకోవాలో అని ఆలోచిస్తారు. అందుకే వృద్ధాశ్రమాలు ఏర్పడ్డాయి'' అన్నారు కృష్ణమూర్తిగారు.

"వాళ్లు మనల్ని వదిలేసే బదులు మనమే స్వచ్ఛంద విరమణ చేస్తే పోలా?'' అన్నారు ప్రకాశరావుగారు.

"అర్థం కాలేదు'' అన్నారు జానకమ్మ, కృష్ణమూర్తిగారు ఒకేసారి.

"నేను చాలా రోజుల నుండి వృద్ధాప్యంలో వచ్చే సమస్యల గురించి ఆలోచిస్తున్నాను. అన్నీ నేను పరిష్కరించలేకపోవచ్చు. కానీ కొంతమటుకు చేయగలనని నమ్మకం ఉంది. కార్యరూపంలో పెట్టడమే ఆలస్యం''

"ఏమిటో వివరంగా చెప్పు'' కృష్ణమూర్తిగారి గొంతులో ఉత్సుకత.

"వృద్ధాప్యం పులిలా మీద పడుతుంది అంటారు. నిజమే. వృద్ధాప్యం కష్టతరమే. అనారోగ్యం, బలహీనం, చేతనారాహిత్యం.. మరెన్నో! మనిషికి జీవితంలోని ఏ దశలో, ఏ వయసులో బాధలు లేవు? బలహీనతలు లేవు? ఏ వయసుకి తగిన సమస్యలు ఆ వయసుకి ఉంటాయి. ప్రకృతి సహజమైన దేన్నయినా జీవులు ఎదుర్కొనక తప్పదు. మేధ కలిగిన మనిషి ప్రతి ఇబ్బందిని, ప్రతి బలహీనతను మరోరకంగా, అనుకూలంగా, బలంగా మలచుకునే అవకాశం ఉంది. మరి అనివార్యమైన వృద్ధాప్యాన్ని అందంగా, అపురూపంగా, అమూల్యంగా మలుచుకునే వీలులేదని ఎలా చెప్పగలం? వృద్ధులు అనుభవంలో వెనుకటి తమ పెద్దల పద్ధతులను అవగాహనతో ఆహార నియమాలు పాటిస్తూ యోగాలాంటి ప్రమాదరహిత వ్యాయామాలతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటే చాలు. మృత్యువు తలుపు తట్టేదాకా జీవితాన్ని ఓ వసంతంలా గడిపేయవచ్చు'' ఆసక్తిగా వింటున్న వారి ముఖాల వంక చూసి తన మాటలు కొనసాగించారు ప్రకాశరావుగారు.

"నా రిటైర్‌మెంట్ డబ్బును పెట్టుబడిగా పెడతాను. గవర్నమెంటు వారి సహాయం తీసుకుంటాను. ప్రభుత్వం వృద్ధులకు వృద్ధాప్య ఫించను, వితంతువులకు వితంతు పింఛను ఇస్తోంది. రేషన్‌కార్డుమీద ఉచితంగా బియ్యం ఇస్తోంది. దీర్ఘకాలిక రోగులకు ఆరోగ్యశ్రీ పథకాలు అమలు చేస్తోంది. ఇవన్నీ ఉండగా కూడా పేదరికంతో కొందరు నరకం అనుభవిస్తున్నారు. ఆస్తి ఉండి పిల్లల నిరాదరణకు గురయ్యేవారు మరి కొందరున్నారు.

నేను ఒక హోమ్ ఏర్పాటు చేయాలనుకుంటున్నాను. దీని ప్రత్యేకత ఏమిటంటే పిల్లలు పెద్దవాళ్లను చేర్పించడం కాదు. పెద్దవాళ్లే స్వచ్ఛందంగా వచ్చి చేరడం. మన అవసరం కుటుంబంలో లేదనుకున్నప్పుడు ఇక్కడకు వచ్చేయవచ్చు. చెల్లించవలసిన రుసుము శ్రమ. చేయలేనివారు తమకు చేతనయింది చేస్తే చాలు. పని చేయగలిగిన ఎంతోమంది నిరాశ్రయులున్నారు, నిరుద్యోగులున్నారు. వారిని సక్రమంగా వినియోగించుకుంటే చాలు'' తన సుదీర్ఘ ఉపన్యాసాన్ని ముగించారాయన.

"ఇదంతా సాధ్యమవుతుందంటారా?'' జానకమ్మ అడిగింది.


"చేసి చూపిస్తాను'' అన్నారాయన.

"అలా చేయగలిగితే మొదట చేరేది మమే. నేను చేయగలిగిన పనులు నాకు కూడా చెప్పు'' అంటూ కృష్ణమూర్తిగారు లేచారు వెళ్లడానికి.

***

అవిరామంగా కృషి చేసి ప్రకాశరావుగారు స్థాపించిన వసతి గృహం పేరు 'ఉత్సాహంగా...ఉల్లాసంగా.' పిల్లలు వద్దని వారించినా వారికి నచ్చచెప్పి ప్రకాశరావుగారి దంపతులు వసతి గృహానికి వచ్చేసారు.కృష్ణమూర్తిగారు, మల్లిగాడు, అంజలి, మామ్మ, నళిని అత్తగారు లాంటి ఎందరో అక్కడ చేరారు. కొంత స్థలంలో కూరగాయలు పండించడం, వ్యవసాయం చేసుకోవడం, తమ అనుభవాల సారాన్నంతా మధురమైన పిండివంటలు, పచ్చళ్లు రూపంలో తయారు చేయడం, వాటికి స్టాల్స్‌లో అమ్మకానికి పంపడం.. ఇలాంటివన్నీ కుర్రవాళ్లకు ధీటుగా వృద్ధులు కాని వృద్ధులుచేసి చూపించారు. వాళ్లకు తమదంతా ఒక కుటుంబం, ఉమ్మడి ఆస్తిగా ఉంది. పెద్దరికం పేరుతో మూలన కూర్చోబెట్టేవాళ్లు లేరక్కడ. అంతా సమవయస్కులు. తమకు తామే ఇంటి నుండి రావడంతో నిరాదరణ భావం కానరావడం లేదక్కడ. వారందరినీ చూడడానికి వస్తున్న పిల్లలు కూడా ఆశ్చర్యపోసాగారు. ఆ నోట ఈ నోట ఈ వార్త జిల్లా కలెక్టర్‌దాకా ప్రాకి తనిఖీకి వచ్చిన ఆయన కూడా ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ప్రకాశరావుగారిని ప్రశంసించారు. అక్కడి నుండి వెళ్లేటప్పుడు ఆయన "నా రిటైర్‌మెంట్ తరువాత నేను ఉండబోయేది ఇక్కడే'' అంటూ వెళ్లారు. ప్రకాశరావుగారి ముఖంలో సంతృప్తి వెల్లివిరిసింది కోటి వెన్నెల కాంతులుగా!

★




కత్రినా కైఫ్ దాదాపు మూణ్ణెల్లుగా తన ఇంటికే వెళ్లలేదుట. దాంతో హోమ్‌సిక్‌గా అనిపిస్తోంది అంటోంది కత్రినా. ఊటీలో నెలకి పైగా షూటింగ్‌తో బిజీగా వున్న కత్రినా ఆ తర్వాత అట్నుంచి అటే అమెరికాకి మరో హిందీ సినిమా షూటింగ్‌కి వెళ్లిపోయింది. అక్కడ కూడా నెలకి పైగానే షూటింగ్‌లో పాల్గొనడంతో ఇంటి మీద ధ్యాస మళ్లిందిట. అందుకనే తన చెల్లెలు ఇసబెల్లెని తన దగ్గరకి రప్పించుకుని కాస్తంత ఊరట పొందిందిట. ఎంత గ్లామర్, సంపాదన వున్నా ఇల్లు ఇల్లే కదా!

